నేడు, రేపు ఉచిత భగవద్గీత తరగతులు

చింతల్: శ్రీ ధర్మశాస్త్ర సేవా సమితి భాగ్యనగర్ శాఖ ఆధ్వర్యంలో ఉచిత భగవద్గీత తరగతులను నిర్వహించనున్నట్లు శ్రీ ధర్మశాస్త్ర సేవా సమితి భగత్‌సింగ్‌నగర్ కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది. శనివారం సాయంత్రం 6:30 నుంచి రాత్రి 8 గంటల వరకు, ఆదివారం ఉదయం 8:30 నుంచి 10 గంటల వరకు చింతల్ డివిజన్ భగత్ సింగ్‌నగర్‌లోని శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయం హరిహర క్షేత్రంలో ఈ తరగతులను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. వివరాలకు 90596 63440, 99492 36133 నెంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.

బీజేపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం



గాంధీనగర్‌లో రంగ శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బీజేపీలో చేరిన మహిళలు

రంగారెడ్డినగర్: బీజేపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని, ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంపై దేశ ప్రజలు విశ్వాసంతో ఉన్నారని బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్.మల్లారెడ్డి అన్నారు. రంగారెడ్డినగర్ డివిజన్ గాంధీనగర్‌లో మేడ్చల్ జిల్లా బీజేపీ ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు రంగ శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో శనివారం సామాజిక సమ్మేళనం నిర్వహించగా పెద్దసంఖ్యలో మహిళలు బీజేపీలో చేరారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఓబీసీ మోర్చా అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందనం దివాకర్ హాజరయ్యారు.

ఎర్లీబర్డ్ టార్గెట్ రూ.60 కోట్లు

హఫీజ్‌పేట్: చందానగర్ సర్కిల్ 21 పరిధిలో ఆస్తి పన్ను వసూళ్లలో భాగంగా మార్చి 31 వరకు రూ.100.72 కోట్లు వసూలు చేసినట్లు ఉపకమిషనర్ వంశీకృష్ణ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు ఎర్లీబర్డ్ కింద ఏప్రిల్ 30 వరకు రూ.60 కోట్లు వసూలు చేయాలని టార్గెట్ పెట్టుకున్నామన్నారు. గత సంవత్సరం ఎర్లీబర్డ్ కింద రూ.48 కోట్లు వచ్చిందని, ఈ సంవత్సరం రూ.60 కోట్లు ఆస్తి పన్ను రాబట్టాలని ప్రయత్నిస్తున్నామని అన్నారు. 5 శాతం రాయితీ ఇస్తున్నామన్నారు. ఇప్పటి వరకు రూ.6.70 కోట్లు ఎర్లీబర్డ్ కింద ఆస్తిపన్ను వసూలయ్యాయన్నారు.

ప్రాణం.. పదిలమేనా..?

అనుమతులు లేని ఆస్పత్రులెన్నో..

- ఆందోళన వ్యక్తం చేస్తున్న ప్రజలు
- వాటిపై వైద్యారోగ్యశాఖ కన్నెర్ర
- 4 ప్రైవేట్ ఆస్పత్రులు, ఒక ల్యాబ్ సీజ్
- మరో క్లినిక్‌కు షోకాజ్ నోటీసు జారీ



గీతా ప్రథమ చికిత్స కేంద్రంలో నోటీసులు అందజేస్తున్న వైద్యాధికారులు

సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ఎలాంటి అనుమతులు లేకుండా కొనసాగుతున్న ప్రైవేట్ ఆస్పత్రులు పదుల సంఖ్యలో ఉన్నాయని భావిస్తున్న వైద్యఆరోగ్య శాఖ వాటిని గుర్తించే పనిలో నిమగ్నమైంది. ప్రభుత్వం జారీ చేసిన నిబంధనలను పట్టించుకోని ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రులపై చర్యలకు సిద్ధవుతోంది. ఇప్పటికే జిల్లాలో ఉప్పల్, కుత్బుల్లాపూర్ ప్రాంతాల్లో నాలుగు ప్రైవేట్ ఆస్పత్రులు(క్లినిక్స్), ఒక ల్యాబ్‌ను సీజ్ చేసిన జిల్లా వైద్యారోగ్యశాఖ మరో క్లినిక్‌కు నోటీసులు జారీ చేసింది. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ప్రైవేట్ ఆస్పత్రులు, ల్యాబ్‌లు, స్కానింగ్ సెంటర్లు, ఫిజియోథెరపీ, డయాగ్నస్టిక్ సెంటర్లు, రిహాబిలిటేషన్ సెంటర్లపై కొరడా ఝులిపించేందుకు వైద్యారోగ్యశాఖ కసరత్తు చేస్తోంది.

వసూళ్లలో ఇష్టారాజ్యం..

ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ ఎలాంటి అనుమతి లేకుండా కొనసాగుతున్న ప్రైవేట్ ఆస్పత్రులు రోగుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నట్లు తెలుస్తోంది. ఫీజుల వసూళ్లలో మొదలుకొని వైద్య పరీక్షలు తదితర వాటి విషయంలో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు పసిగట్టిన జిల్లా వైద్యారోగ్య ఆస్పత్రుల్లో బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు ఫీజులకు సంబంధించిన ధరల పట్టిక జాబితాతో సహా డాక్టర్లు, సిబ్బంది, బెడ్ల సంఖ్య వంటి విషయాలను పొందుపర్చాలని సూచిస్తూ ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది.

అనుమతి ఉన్నవి 1605 ఆస్పత్రులే..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 2,500 పైగా ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రులు ఉన్నాయి. అందులో రిజిస్ట్రేషన్‌తో సహా వివిధ అనుమతితో నడుస్తున్న ఆస్పత్రులు 1605 మాత్రమే ఉన్నాయి. అందులో 100 కంటే ఎక్కువ పడకలు(బెడ్లు) కలిగి ఉన్న ప్రైవేట్ ఆస్పత్రులు 48 ఉన్నాయి. 20 నుంచి 100 పడకలు(బెడ్ల) వరకు ఉన్న ఆస్పత్రులు 317 ఉన్నట్లు వైద్యారోగ్యశాఖ పేర్కొంటోంది. 20 పడకలు (బెడ్లు) ఉన్న ఆస్పత్రులు 294 ఉన్నాయి. అలాగే, పాలీక్లినిక్‌లు, క్లినిక్‌లు, డయాగ్నోస్టిక్ సెంటర్లు 712, డెంటల్ ఆస్పత్రులు 180, ఫిజియోథెరపీ సెంటర్లు 46, రిహాబిలిటేషన్ సెంటర్లు 8, అనుమతి పొందిన స్కానింగ్ సెంటర్లు 628 ఉండగా, ఏ అనుమతి లేని 400 సాన్కింగ్ సెంటర్లు ఉన్నట్లు వైద్యారోగ్య శాఖ అంచనా వేస్తోంది.

7 రోజుల్లోనే ఐదు క్లినిక్‌లు సీజ్

తెలంగాణ రాష్ట్ర ప్రాంతీయ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఆదేశాల మేరకు గతనెల 27న వైద్య బృందం ఉప్పల్‌లోని శ్రీమణికంఠ హెల్త్‌కేర్ అండ్ పాలీ క్లినిక్, చిలుకానగర్‌లోని శ్రీరాజు ఫస్ట్ ఎయిడ్ క్లినిక్‌ను తనిఖీ చేసిన వైద్య బృందం అర్హత కలిగిన వైద్యులు, సిబ్బంది లేరని గుర్తించి వాటిని సీజ్ చేశారు. అలాగే, సరైన డాక్యుమెంట్స్ లేని చిలుకానగర్ మెసర్స్ మహాలక్ష్మి క్లినిక్‌కు నోటీసు జారీ చేశారు.

- ఈ నెల 3న షాపూర్‌నగర్‌లో ఆర్‌ఆర్ శ్రీజన్ క్లినిక్, శ్రీవీరభద్ర ఫస్ట్ ఎయిడ్ క్లినిక్, అన్నపూర్ణ ల్యాబ్‌లను తనికీ చేసిన వైద్య బృందం అర్హతలేని వైద్యులు, సిబ్బందితో వాటిని నడుపుతున్నారని గుర్తించి, వాటిని సీజ్ చేశారు. గత సంవత్సరంలో ఇదే సీజన్‌లో పీర్జాదిగూడలో ఎలాంటి అనుమతులు లేకుండా కొనసాగుతున్న ఒక ప్రైవేట్ ఆస్పత్రిని సీజ్ చేసిన వైద్యబృందం స్థానికంగా ఉన్న పలు ప్రైవేట్ ఆస్పత్రుల్లో తనిఖీలు నిర్వహించి మరో 4 ప్రైవేట్ ఆస్పత్రులకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఈ నేపథ్యంలోనే మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల రిజిస్ట్రేషన్, అనుమతులు తదితర విషయాలపై వైద్యారోగ్యశాఖ ఆరా తీస్తోంది.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించటంతో పాటు ఎలాంటి అనుమతులు తీసుకోకుండా నడుస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రులపై చర్యలు తీసుకుంటాం. వాటిని గుర్తించేందుకు వివరాలు సేకరిస్తున్నాం. తనిఖీలు నిర్వహిస్తున్నాం. ప్రైవేట్ ఆస్పత్రిలోని బోర్డుపై డాక్టర్లు, సిబ్బందితో సహా అన్ని వివరాలు, సమాచారం ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం.

– డా.రఘునాథస్వామి, డీఎంహెచ్‌ఓ, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా

నకిలీ వైద్యులతో వైద్యం

గోకుల్‌నగర్ గీతా ప్రథమ చికిత్స కేంద్రం సీజ్

సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా పరిధిలోని సైనిక్‌పురి, గోకుల్‌నగర్‌లోని గీతా ప్రథమ చికిత్స కేంద్రంలో అర్హత లేని నకిలీ వైద్యులు అల్లోపతి వైద్యం చేస్తూ రోగులకు మందులు రాస్తుండటంతో ఆ కేంద్రాన్ని సీజ్ చేసినట్లు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ రఘునాథస్వామి తెలిపారు. శనివారం గీతా ప్రథమ చికిత్స కేంద్రంలో తనిఖీలు నిర్వహించగా, నకిలీ వైద్యుల విషయం బయటపడిందని తెలిపారు. నేషనల్ మెడికల్ కమిషన్ నిబంధనలు, టీఎస్‌ఎంసీ చట్టం ప్రకారం అవసరమైన చర్యలు తీసుకోనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ విషయమై సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో గీతా ప్రథమ చికిత్స కేంద్రంతో సహా నకిలీ వైద్యులపై ఎఫ్ఆర్ఐ నమోదైందన్నారు. తనిఖీల్లో డీఎంహెచ్‌ఓ డాక్టర్ టి.రఘునాథస్వామి, మల్కాజిగిరి డివిజన్ డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ ఆనంద్, డాక్టర్లు కపూర్, శ్రీనివాస్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీరాములు, పోలీసు అధికారులు ఉన్నారు.





మంత్రి తుమ్మలను కలిసిన కూన



మంత్రి తుమ్మలను కలిసిన కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావును శనివారం మినిస్టర్ క్వార్టర్స్‌లోని ఆయన నివాసంలో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలం గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. శ్రీశైలంగౌడ్ తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేరడంపట్ల మంత్రి తుమ్మల హర్షం వ్యక్తం చేశారు. ఆయన వెంట టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి తదితరులు ఉన్నారు.

అయోధ్యలో శంభీపూర్, చామకూర



అయోధ్యలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే మల్లారెడ్డి, తదితరులు

కుత్బుల్లాపూర్: అయోధ్యలోని శ్రీరాముల వారిని ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు శంభీపూర్ రాజు దర్శించుకున్నారు. ఆయనతో పాటు మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, సివిల్ సప్లై కార్పొరేషన్ మాజీ చైర్మన్ మారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, తిరుపతి రెడ్డి బాలకృష్ణా రెడ్డి తదితరులు దర్శించుకున్నారు.

బీజేపీ ఆవిర్భావ దినోత్సవం



జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో శేఖర్‌యాదవ్

జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలోని పలు కూడళ్లలో శనివారం బీజేపీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. జగద్గిరిగుట్టలోని పార్టీ ఆఫీస్ వద్ద రాష్ట్ర ఓబీసీ కార్యవర్గ సభ్యులు జేకే శేఖర్ యాదవ్, లాస్ట్ బస్టాప్‌లో జగద్గిరిగుట్ట ఓబీసీ అధ్యక్షుడు మాదవులు ఆధ్వర్యంలో ఈ బీజేపీ ఆవిర్భావకార్యక్రమం జరిగింది.

మౌలిక వసతులు సమకూరుస్తాం



సైబేజ్ సాఫ్ట్‌వేర్ కంపెనీ వారు అందజేసిన బెంచీలతో విద్యార్థులు

జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలోని జగద్గిరినగర్ ప్రభుత్వ పాఠశాలకు సైబేజ్ సాఫ్ట్‌వేర్ కంపెనీ ఉద్యోగులు శనివారం 80 బెంచీలను అందజేశారు. గచ్చిబౌలిలోని సైబేజ్ సాఫ్ట్‌వేర్ కంపెనీ తమ కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో సైబేజ్ సాఫ్ట్‌వేర్ కంపెనీ డెలివరీ మేనేజర్ హనుమారెడ్డి, సీనియర్ ఎగ్జిక్యూటివ్ అన్నపురపు సురేష్, స్కూల్ హెడ్ మాస్టర్ సుభాష్ చంద్రబోస్‌తోపాటు కంపెనీకి చెందిన వినయ, శిల్ప, శ్వేత, గోపికృష్ణ, సత్య సాయిరాం, భువనేష్, గుల్షన్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

అన్నివర్గాల ప్రజలకు అభివృద్ధి ఫలాలు



బీజేపీ జెండాను ఎగురవేసిన మల్లారెడ్డి

సుభాష్‌నగర్: వికసిత్ భారత్ ద్వారా అన్ని వర్గాల ప్రజలకు అభివృద్ధి ఫలాలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అందిస్తోందని ఆ పార్టీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి అన్నారు. శనివారం బీజేపీ ఆవిర్భావ దినోత్సవం నేపథ్యంలో జంట సర్కిళ్లు, మున్సిపాలటీల పరిధిలో పార్టీ జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధిపరిచేందుకు ప్రధాని నరేంద్రమోదీ అవిశ్రాంతం కృషి చేస్తున్నారని, రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ హ్యాట్రిక్ విజయం సాధించడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంల నాయకులు సత్యనారాయణ, అశోక్, దుర్గ, నర్సింగ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

వృథాగా తాగునీరు

నిజాంపేట్: అభివృద్ధి పనుల్లో జాగ్రత్తలు తీసుకోకపోవడంతో తాగునీరు వృథాగా పోతోంది. నిజాంపేట్ కార్పొరేటర్ బాచుపల్లి చౌరస్తాలో గత కొన్ని నెలలుగా ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులు కొనసాగుతున్నాయి. నిర్మాణ పనుల నేపథ్యంలో రోడ్డు తవ్వకాలు చేపట్టారు. దీంతో చౌరస్తా గుండా వెళ్తున్న తాగునీటి పైపులైన్‌కు లీకేజీ ఏర్పడంతో గత కొన్నిరోజులుగా నీటి సరఫరా జరిగే సమయాల్లో వృథాగా పోతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు లీకేజీని అరికట్టాలని పలువురు కోరుతున్నారు.



బాచుపల్లి చౌరస్తాలో ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం వద్ద వృథాగా పోతున్న తాగునీరు

రాగిడికి మద్దతుగా ప్రచారం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేకానంద్, చిత్రంలో రాగిడి లక్ష్మారెడ్డి

కుత్బుల్లాపూర్: బీఆర్‌ఎస్ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి మద్దతుగా కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ శనివారం ప్రచారం నిర్వహించారు. నిజాంపేటలోని శ్రీరామకుంట పార్కులో లక్ష్మారెడ్డితో కలిసి వివేకానంద్ వాకర్లతో ముచ్చటించారు. అనంతరం కార్పొరేషన్ పరిధిలోని బీఆర్‌ఎస్ నేతలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివేకానంద్ మాట్లాడుతూ బీజేపీ, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు ఈటల రాజేందర్, పట్నం సునీత మహేందర్‌రెడ్డి కుటుంబాలు పదవుల కోసమే రాజకీయాలు చేస్తాయని, ప్రజల కోసం కాదన్నారు. రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే వివేకానంద్ రూ. 6 కోట్లతో నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్ యాదవ్, కార్పొరేటర్లు మేకల వెంకటేశం, బాలాజీనాయక్, ఆగం రాజు, కాసాని సుధాకర్, రాఘవేందర్‌రావు, రవి కిరణ్, రజిత, జ్యోతి, బొర్ర దేవి, శనిగల ప్రణయ, గాజుల సుజాత, పైడి మాధవి, కొలన్ సునీల్ రెడ్డి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పార్కుస్థలాన్ని కాపాడాలి



పార్కు స్థలమంటూ మున్సిపల్ అధికారులు బోర్డు, ఆట వస్తువులను ఏర్పాటు చేసిన దృశ్యం(ఫైల్)



మున్సిపల్ కార్పొరేషన్ మేనేజర్ చంద్రప్రకాశ్‌కు ఫిర్యాదు చేస్తున్న దృశ్యం

నిజాంపేట్: ప్రజలకు ఉపయోగపడే పార్కుస్థలాన్ని కాపాడాలని కోరుతూ బీజేపీ ఆధ్వర్యంలో శనివారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షుడు ఆకుల సతీష్ మాట్లాడుతూ బాచుపల్లి రెయిన్‌బో కాలనీలో సుమారు 2,800 గజాల స్థలంలో నాటి మున్సిపల్ కమిషనర్ గోపి ఈ పార్కును లక్షలాది రూపాయలతో అభివృద్ధి చేసి పిల్లలు ఆడుకునే ఆటవస్తువులను సైతం ఏర్పాటు చేశారు. కానీ, ఇటీవల కొంత మంది కబ్జాదారులు ఈ పార్కు స్థలం తమదంటూ పార్కు బోర్డును సైతం తొలగించి చదును చేసి తమ ఆధీనంలో ఉంచుకున్నారని ఆరోపించారు. అయితే స్థానికులు పార్కు స్థలం కాపాడాలంటూ కోర్టును ఆశ్రయించారు. ఈ కార్యక్రమంలో గొల్లక్రిష్ణ, బిక్షపతి యాదవ్, అరుణ్‌రావు, ఎల్లస్వామి, శివరామ్ తదితరులు పాల్గొన్నారు.



అన్నదాన కార్యక్రమంలో భక్తులు

అన్నదానం

జగద్గిరిగుట్ట: చింతల్ శ్రీ సాయి కాలనీలోని హనుమాన్ ఆలయంలో శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు, గత 18 వారాలుగా ప్రతీ శనివారం ఈ ఆలయంలో శ్రీ హనుమాన్ అన్నప్రసాద సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

ఎన్నికల విధులపై శిక్షణ

హఫీజ్‌పేట్: చందానగర్‌లోని అంబేడ్కర్ కళ్యాణ మండపంలో శేరిలింగంపల్లి జోన్ పరిధిలోని ఓపీఓలకు శనివారం ఎన్నికల విధులపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమాన్ని జోనల్ కమిషనర్ స్నేహ శబరీష్, చందానగర్ డీసీ వంశీకృష్ణలు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల విధులలో నిర్లక్ష్యం వహించకూడదన్నారు. పోస్టల్ బ్యాలెట్, ఫారం 12లపై సుమారు 229 మంది ఓపీఓలకు శిక్షణ తరగతులు నిర్వహించారన్నారు.

హెచ్‌సీయూలో 'క్లీనప్ డ్రైవ్'

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ క్యాంపస్‌లో శనివారం 'క్లీనప్ డ్రైవ్' కార్యక్రమాన్ని చిల్డ్రన్స్ పార్కులో నిర్వహించారు. హెచ్‌సీయూలోని ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో శానిటేషన్ విభాగం, హార్టికల్చర్ విభాగం సహకారంతో ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు ఈ డ్రైవ్‌లో పాల్గొన్నారు. పార్కులో చెత్తాచెదారం, వ్యర్థాలు ప్లాస్టిక్ కవర్లు, ఇతరత్రా వాటిని తొలగించారు. డంపింగ్‌యార్డ్‌కు తరలించారు. హెచ్‌సీయూ శానిటేషన్, హార్టికల్చర్ విభాగాల అధికారులు సుధాకర్, విష్ణు, యాదగిరి, ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

'లేటెస్ట్ అప్‌డేట్స్ ఇన్ కార్డియాలజీ' సదస్సు

రాయదుర్గం: హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని 'టీహబ్' లో మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో 'లేటెస్ట్ అప్‌డేట్స్ ఇన్ కార్డియాలజీ' పేరిట శనివారం సదస్సు నిర్వహించారు. కంటిన్యూయింగ్ మెడికల్ ఎడ్యుకేషన్(సీఎంఈ) ద్వారా ప్రత్యేక అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు.కార్డియాలజీ అడ్వాన్స్‌మెంట్స్‌పై మెడికల్ ఫిజీషియన్లకు సదస్సులో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రముఖ కార్డియాలజిస్టులు డాక్టర్ అనిల్‌కృష్ణ, సీనియర్ కన్సల్టెంట్స్, ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్, చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ శరత్‌రెడ్డి, వైద్యులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కాలేజీలో కొనసాగుతున్న సెంటర్ ఫర్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ ట్రైనింగ్ (సెల్ట్)లో ఇంటర్, పాఠశాల విద్యార్థులకు వేసవి ప్రత్యేక శిక్షణ తరగతులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. ఇంగ్లిష్ కమ్యూనికేషన్ స్కిల్స్, పర్సనాల్టీ డెవలప్‌మెంట్ కోర్సుల్లో నెల రోజుల శిక్షణకు 15 నుంచి తరగతులు ప్రారంభం కానున్నట్లు అధికారులు తెలిపారు. ఇంటర్ విద్యార్థులకు ఉదయం 6.30 నుంచి 8 గంటల వరకు తరగతులు నిర్వహించనున్నారు. నగరంలో వివిధ పాఠశాల్లో చదివే 8, 9, 10వ తరగతి విద్యార్థులకు ఉదయం 8.15 నిమిషాల నుంచి 9.45 వరకు తరగతులు నిర్వహించనున్నట్లు డైరెక్టర్ ప్రొ.సవీన్ తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు నేటి నుంచి (7న) దరఖాస్తు చేసుకోవాలన్నారు.

పారిశుధ్య సిబ్బంది హాజరుపై తనిఖీ



భార్గవ్ నారాయణ, కుత్బుల్లాపూర్ ఏఎంహెచ్‌ఓ

కుత్బుల్లాపూర్: పారిశుధ్య సిబ్బంది హాజరు శాతం విషయంలో అక్రమాలు చోటుచేసుకోకుండా ప్రతిరోజు ఉదయం మధ్యాహ్నం సమయంలో తనిఖీలు చేపడుతున్నట్లుకుత్బుల్లాపూర్ సర్కిల్ వైద్య, ఆరోగ్య అధికారి భార్గవ్ నారాయణ అన్నారు. మొత్తం సర్కిల్ పరిధిలో 62 గ్రూపులు ఉండగా వీటిని శానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్స్ పర్యవేక్షణ చేస్తూ ప్రతిరోజు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు చేస్తున్న పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఎవరైనా విధుల్లో నిర్లక్ష్యం వహించిన చెత్తను కాల్చివేసిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

మంచినీటి సౌకర్యం అందించే దిశగా...

పారిశుధ్య కార్మికులకు, సర్కిల్ కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులకు వేసవికాలాన్ని దృష్టిలో పెట్టుకొని మంచినీటి సౌకర్యాన్ని కల్పించే దిశగా అడుగులు వేశారు. కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అభిలాష్ అభినవ్ ఆదేశాల మేరకు 450 సిబ్బందికి వాటర్ బాటిళ్లను అందజేశారు. శనివారం కుత్బుల్లాపూర్ సర్కిల్ వైద్య, ఆరోగ్య అధికారి భార్గవ్ నారాయణ, శానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్లతో కలిసి పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న ఈ సమయంలో వారికి మంచినీటి బాటిల్లను అందజేసి దాహార్తిని తీర్చే దిశగా చర్యలు చేపట్టారు.

జనజాతరకు తరలిన కార్యకర్తలు



మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ ఆధ్వర్యంలో జనజాతరకు తరలివెళ్తున్న దృశ్యం



కొంపల్లి నుండి మున్సిపల్ అధ్యక్షుడు భైరి భాస్కర్‌గౌడ్ ఆధ్వర్యంలో..

కుత్బుల్లాపూర్: నగరంలోని తుక్కుగూడలో శనివారం సాయంత్రం జరిగిన కాంగ్రెస్ పార్టీ జన జాతరకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుంచి భారీ ఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు. షాపూర్‌నగర్ నుంచి మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, కొలన్ హన్మంతరెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి ఆధ్వర్యంలో, కొంపల్లి మున్సిపల్ నుంచి భైరి భాస్కర్‌గౌడ్ ఆధ్వర్యంలో జనజాతర సభకు ర్యాలీగా కాంగ్రెస్ శ్రేణులు తరలి వెళ్లారు.

ఆటోవాలా.. పార్కింగ్ ఇలా!



షాపూర్‌నగర్ చౌరస్తాలోని గాజులరామారం మూలమలుపు వద్ద నిలిపివున్న ఆటోలు

కుత్బుల్లాపూర్: ఆటోవాలాలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. షాపూర్‌నగర్ నుంచి గాజులరామారం వెళ్లే ఈఎస్‌ఐ ఆసుపత్రి మూలమలుపు వద్ద ఆటోలు నిలిపి రోడ్డు మీదనే పార్కింగ్ చేస్తున్నారు. గతంలో ఉషోదయ టవర్ చౌరస్తా వద్ద ఆటోడ్రైవర్లు రోడ్డుపైనే పార్కింగ్ చేసి ప్యాసింజర్లను ఎక్కించుకుంటున్నారు. చింతల్ నుంచి గాజులరామారం వెళ్లే దారి ఫ్రీ లెఫ్ట్ మూలమలుపు వద్ద వీరి హడావిడి ఎక్కువగా ఉండటంతో నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఇంత జరుగుతున్న ట్రాఫిక్ పోలీసులు ఈ సమస్యపై దృష్టి పెట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది. రంగా భుజంగా థియేటర్ సమీపంలో ట్రాఫిక్ పోలీసులు వివిధ వాహనాలను ఆపి చలాన్లు విధిస్తూ టార్గెట్ పూర్తి చేసుకుంటున్నారు. కానీ, ఇక్కడి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించే విషయంలో విఫలం అవుతున్నారని వాహనదారులు ఆరోపిస్తున్నారు. నిత్యం ఈఎస్‌ఐ ఆసుపత్రి మూలమలుపు వద్ద ఆటో డ్రైవర్లు ఆపి ట్రాఫిక్ చిక్కులు తెచ్చి పెడుతున్న విషయంపై దృష్టి సారించాలని కోరుతున్నారు.